మనం
హైదరాబాద్
రంగారెడ్డి | మేడ్చల్
సోమవారం | 27 | ఏప్రిల్ | 2026 | పేజీలు 4 | www.manamepaper.com



# స్వీయ జనగణనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

## జిల్లా కలెక్టర్ మను చౌదరి

స్వీయ జనగణనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు. ఆదివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ మను చౌదరి ప్రెస్ మీట్ ఏర్పాటు మాట్లాడుతూ జనాభా లెక్కల స్వీయ గణన ఈనెల 26 నుండి మే 10 వరకు ఉంటుందని ఇప్పుడు ప్రజలే తమ వివరాలను తామే నమోదు చేసుకునే సౌకర్యం అందుబాటులో ఉంది! ఈ అవకాశాన్ని వినియోగించుకుని సులభంగా మీ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవాలన్న https://se.census.gov.in Self Enumeration (HLO) Login వద్ద తెలంగాణ ఎంపిక చేసి, కాపచ్చా ఎంటర్ చేసి వెరిఫై, ప్రొసీడింగ్స్ క్లిక్ చేయాలని సూచించారు.వెల్కమ్ పేజీలో కుటుంబ పెద్ద పేరు, మొబైల్ నంబర్ నమోదు చేయాలని సూచించారు. ఈ ప్రక్రియ మొత్తము 15 నిమిషాల్లో పూర్తి అవుతుందని కలెక్టర్ తెలిపారు.

మేడ్చల్, ఏప్రిల్ 26 ( మనం జిల్లా ప్రతినిధి) : ఒక కుటుంబానికి ఒకే మొబైల్ నంబర్ ఉపయోగించాలని వచ్చిన ఓటీపీ ఎంటర్ చేసి వెరిఫై ప్రొసీడింగ్స్ క్లిక్ చేయాలని తరువాత మీకు నచ్చిన భాషను ఎంచుకోవాలని, మీ జిల్లా, పట్టణం/గ్రామం, పిన్ కోడ్ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మొబైల్ లో లొకేషన్ ఆన్ చేసి, మీ

- మిగతా 2లో..



# ఘనంగా వాసవి మాత జయంతి

ఆర్యవైశ్యుల కులదేవత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి వేడుకలు మేడ్చల్ లోని శ్రీ వాసవి మాత దేవస్థానం స్థలంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు శ్రావణ్ గుప్తా ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఆర్యవైశ్య మహిళలు గంగ జలాన్ని కలశాల తో పాటు పంచామృతలతో అమ్మవారికి అభిషేకం చేశారు. ఆర్యవైశ్య మహిళలు సామూహిక కుంకుమార్చన,అమ్మవారి జీవిత చరిత్ర మరియు అష్టోత్తరం పారాయణం కార్యక్రమాన్ని నిర్వ హించారు.

2

# చేపలు మృత్యువాత

గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధి గుండ్ల, నీళ్ల చెరువు పరిసర ప్రాంతాల్లో నిర్మించిన విల్లాస్ నుంచి డ్రైనేజీ నీటిని సెవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ లేకుండానే మురుగు నీటిని చెరువులో కలపడం వల్ల నీటి నాణ్యత క్షీణించి, చేపలు పెద్ద ఎత్తున మృత్యువాత పడుతున్నాయని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులోకి చేరుతున్న కలుషిత నీటిలో రసాయనాలు, బ్యాక్టీరియా, విషపూరిత పదార్థాలు అధికంగా ఉండటంతో నీటిలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గిపోయితున్నాయని దింతో చెరువుపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకార కుటుంబాలు తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

*– మేడ్చల్, ఏప్రిల్ 26 ( మనం జిల్లా ప్రతినిధి ) :*

వివరాలు 2లో..



# చేపలు మృత్యువాత



మేడ్చల్, ఏప్రిల్ 26 (మనం జిల్లా ప్రతినిధి) : చేపల మరణంతో చేపల ఉత్పత్తి తగ్గిపోవడంతో పాటు వేటకు వెళ్లే మత్స్యకారులకు ఆదాయం లేకుండా పోతోందని లక్షల్లో నష్టం వాటిల్లుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన స్పందించడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. స్థానికులు చెబుతున్న వివరాల ప్రకారం, విల్లాస్ నుంచి వచ్చే డ్రైనేజీ నీరు నేరుగా చెరువులో కలుస్తుండటంతో నీరు నల్లగా మారి దుర్వాసన వల్ల చెరువుల్లో చేపల మృతికి



కారణమయ్యాయని తెలిపారు. ఈ సమస్యపై కాలుష్య నియంత్రణ శాఖ, స్థానిక మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి చెరువుల్లోకి మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.

# ఘనంగా వాసవి మాత జయంతి వేడుకలు



మేడ్చల్, ఏప్రిల్ 26 ( మనం జిల్లా ప్రతినిధి) : ఆర్యవైశ్యుల కులదేవత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి వేడుకలు మేడ్చల్ లోని శ్రీ వాసవి మాత దేవస్థానం స్థలంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు శ్రావణ్ గుప్తా ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఆర్యవైశ్య మహిళలు గంగ జలాన్ని కలశాల తో పాటు పంచామృతలతో అమ్మవారికి అభిషేకం చేశారు. ఆర్యవైశ్య మహిళలు సామూహిక కుంకుమార్చన,అమ్మవారి జీవిత చరిత్ర మరియు అష్టోత్తరం పారాయణం కార్యక్రమాన్ని నిర్వ హించారు.పూజలో కూర్చున్న భక్తులకు అన్ని ఏర్పాట్లను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు .పూజలో కూర్చున్న భక్తులు అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించారు.అనంతరం అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.శ్రీ వాసవి మాత దేవాలయానికి సహకరించిన ట్రస్ట్ సభ్యులను సన్మానించి దేవస్థాన పేరును ప్రకటించారు.సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహంచే శోభాయాత్ర అయ్యప్ప ఆలయం నుండి ప్రధాన విధుల గుండా కోలాట కార్యక్రమాలతో అంగరంగా వైభవంగా కొనసాగింది.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బద్రి నారాయణ, ప్రధాన కార్యదర్శి కృష్ణ మూర్తి,కోశాధికారి గోలి శ్రీధర్, మున్సిపాలిటీ అధ్యక్షుడు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి సఖిలం వెంకటేష్,కోశాధికారి యాద రాంచందర్, మహిళ అధ్యక్షురాలు సంగీత, ప్రధాన కార్య దర్శి సవిత,కోశాధి కారి సునీత, యూత్ అధ్యక్షుడు వెంకట్, ప్రధాన కార్యదర్శి నాగేష్, కోశాధికారి అవినాష్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



# ఘట్కేసర్ లో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ హాస్టల్ బాట

మేడ్చల్, ఏప్రిల్ 26 (మనం జిల్లా ప్రతినిధి) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలోని సంక్షేమ వారోత్సవాలలో భాగంగా, ఘట్కేసర్‌లోని ఎస్‌సి బస్తీలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో "హాస్టల్ బాట" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జి. వినోద్ కుమార్ సహాయ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. గోపి చంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా అధికారులు బస్తీ ప్రజలతో సమావేశమై విద్యార్థుల హాస్టల్ ప్రవేశాలు, సంక్షేమ పథకాలు, హాస్టళ్లలో అందిస్తున్న సౌకర్యాలు విద్యార్థుల కోసం చేపడుతున్న చర్యలను వివరించారు. విద్యార్థులు ప్రభుత్వ హాస్టళ్లలో చేరి మెరుగైన విద్యను అభ్యసించేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారులు మహేష్, క్రాంతి, దెన్యా మరియు సిబ్బంది పాల్గొన్నారు.





# 2000 పిల్లలతో కరాటే ప్రదర్శన



గచ్చిబౌలి, ఏప్రిల్ 26, మనం న్యూస్ : 2000 పిల్లల కరాటే ప్రదర్శనతో ఈ నెల 26వ తేదీ నా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం గిన్నిస్ బుక్లో పాల్గొన్నా మల్కాజిగిరి, నాగోల్ బండ్లగూడ సహభవన టౌన్‌షిప్ కు మరియు పద్మారావు నగర్ కరాటే విద్యార్థులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించారు. చైత్ర శ్రీ, , రామ కృష్ణ, శ్రీశాంత్, ఆకాష్, త్రిశూల్, శ్రీ తేజస్వి, అలిస్, హాసిని, శివ సాయి శ్రీవాస్తవ, గాయత్రి, సాయి కార్తికేయ, ప్రవీణ్, కీర్తన బి, శ్రీ తనయ్ బి, వేదాంష్ దివ్య నాయర్, ఐషి నాయర్, వినయ్ నాయర్, అనుగ్రహ, కోడి హిసిని, యశస్విని, కావ్య శ్రీ, నియతి, నికిత, కార్తీక, అక్షయ, సాన్వి ప్రియ, లక్ష్మి ప్రియ, శ్రీనివాస్, విఘ్నేష్, స్మరణ్ గౌడ్, ధరణిత, వ్యోమి పాండే, లక్షిక, కుర్తిక, హన్సిక, సాన్వీ పండుగ ,అక్షంత్, ఆదిత్య, ఆద్య శ్రీ, మాస్టర్ కుమారస్వామికి, సీనియర్ మాస్టర్ రవి, గ్రాండ్ మాస్టర్ జయంత్ రెడ్డి అభినందనలు తెలియజేసారు.


# స్వీయ జనగణనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

మొదటి పేజీ తరువాయి

ఇంటి వద్ద రెడ్ మార్క్ సెట్ చేయాలని, ఇళ్ల వివరాలకు సంబంధించిన 33 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి, ప్రివ్యూ ద్వారా చెక్ చేసి సబ్మిట్ చేయాలని సూచించారు. సబ్మిట్ చేసిన తరువాత హెచ్ తో ప్రారంభమయ్యే 11 అంకెల ఎస్ ఈ ఐడి వస్తుందని తెలిపారు. దాన్ని స్క్రీన్షాట్ లేదా నోట్ చేసుకుని భద్రపరచుకోవాలని తెలిపారు. మే 11 తరువాత మీ ఇంటికి వచ్చే గణన అధికారికి ఈ ఎస్ఈ ఐడి చూపిస్తే వారు అప్రూవ్ చేస్తారన్నారు. స్వయంగా నమోదు చేసి సమయాన్ని ఆదా చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ నెల 26 నుండి మే 10 వరకు జిల్లాలో స్వీయ గణన కార్యక్రమం కొనసాగుతుందని ఇందులో జిల్లాలోని ప్రతి ఒక్కరూ పాల్గొని వారి యొక్క వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటి సమాచారం నమోదు చేయబడుతుందని, ఇంటి పరిస్థితి సౌకర్యాలు ప్రాథమిక సమాచారం సేకరించబడుతుందన్నారు. స్వీయ గణన ఆన్లైన్ పోర్టల్ వెబ్సైటును సందర్శించి సెల్ఫ్ డిక్లరేషన్ ఐడి పొందాలని, ఈనెల 26 నుండి మే 10 వరకు జరిగే గణనలో గుర్తించబడిన ఉద్యోగులు సర్వే నిమిత్తం ఇంటికి వచ్చినప్పుడు మీ ఐడి తెలియపరచాలని తెలిపారు. జనగణన వల్ల ప్రతి ఒక్కరి భవిష్యత్తు కార్యాచరణ విధానాలకు ఖచ్చితమైన ఆధారం, వనరుల సరి అయిన పంపిణీ, ప్రణాళికలు, మెరుగైన సౌకర్యాలు పాఠశాలలు, ఆసుపత్రులు, రహదారులు, తమ ప్రాంతాల అభివృద్ధికి సహాయ, సహకారాలు పథకాల అమలు జనాభా గణాంకాలు ద్వారా వెల్లడించడం జరుగుతుందన్నారు, మీ సమాచారం పూర్తిగా సురక్షితంగా ఉంటుందని గోప్యంగా ఉంచబడుతుందని, పేర్లు గుర్తింపు బహిర్గతం చేయబడవని కలెక్టర్ అన్నారు. సర్వే సిబ్బంది గుర్తించబడిన వారు వచ్చినప్పుడు ఖచ్చితమైన సంపూర్ణమైన వివరాలు ఇవ్వాలని, మీరు సరియైన సమాచారం భవిష్యత్తులో అనేక విధాలుగా ఉపయోగపడుతుందని జనాభా గణనలో గర్వంగా పాల్గొనాలని, దేశ అభివృద్ధికి సహకరించాలని అన్నారు. జిల్లాలో ఈ జనాభా గణన కార్యక్రమం నిర్వహణ కోసం సిబ్బందిని నియమించడం జరిగిందని వారికి రెండు దఫాలుగా శిక్షణ పూర్తి చేయడం జరిగిందనీ, ఈ జనాభా గణన కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

# ఘనంగా వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి

జవహర్ నగర్, ఏప్రిల్ 26(మనం న్యూస్) : ఆర్యవైశ్యుల కులదైవమైన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు జవహర్ నగర్‌లోని శ్రీరాంనగర్ కాలనీలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. జవహర్ నగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు చిరంజీ రవీందర్ గుప్తా నేతృత్వంలో నిర్మించిన దేవస్థానంలో ఈ వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని పూలతో, ఆకుల తోరణాలతో, విద్యుత్ దీపాలతో అద్భుతంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అభిషేకాలు, అష్టోత్తర శతనామ పూజలు, కుంకుమార్చనలు నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. వందలాది మంది భక్తులు "ఓం శ్రీ మాత్రే నమః" అంటూ భక్తి పరవశ్యంలో పాల్గొన్నారు. అధ్యక్షుడు రవీందర్ గుప్తా మాట్లాడుతూ, వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలను జరుపుకోవడం ఎంతో పుణ్యప్రదమని, భక్తితో చేసిన పూజలు పూర్వజన్మ సుకృతానికి నిదర్శనమని అన్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు నిర్వహించడం విశేషమని తెలిపారు. కుంకుమార్చన అనంతరం పాల్గొన్న మహిళలకు అమ్మవారి కానుకగా చీరలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి బద్రిష్ గుప్తా, కోశాధికారి పైడి రమేష్ గుప్తా, ఉప కోశాధికారి గట్టు చంద్రశేఖర్ గుప్తా, సలహాదారులు బెజగం రాజేశం గుప్తా, ఉడుత లక్ష్మణమూర్తి గుప్తా, ఉపాధ్యక్షులు ఉప్పగళ్ల ఆంజనేయులు గుప్తా, బుస్స సంతోష్ గుప్తా, మా శెట్టి హరీష్ గుప్తా, సోమ సత్యనారాయణ గుప్తా, పోతుగంటి సోమలింగం గుప్తా, చిరంజీ శ్రీలత, పావని, రజని, పుష్పలత, రూప, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.





## వాసవి మాత జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

సికింద్రాబాద్, ఏప్రిల్ 26 (మనం న్యూస్) :ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన వాసవి కన్యకాపరమేశ్వరి అహింస, ఆత్మగౌరవం, శాంతికి ప్రతీకగా నిలుస్తారని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. వాసవి మాత జయంతి సందర్భంగా శనివారం రాత్రి రాంగోపాల్ పేట డివిజన్‌లోని ఆవులమండలో ఉన్న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం నుంచి నిర్వహించిన యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ నార్ల దీపక్, ఆలయ చైర్మన్ చందా బాలేందర్, ప్రధాన కార్యదర్శి తమ్మి వెంకటేష్‌తో పాటు బచ్చు మహేష్, శరత్, గుండా శ్రీనివాస్, వినోభ, ప్రేమ్, తడ్క వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# తైక్వాండోతో ఆత్మవిశ్వాసం

### రాష్ట్ర స్థాయి పోటీలు ఘన ప్రారంభం

సికింద్రాబాద్, ఏప్రిల్ 26 (మనం న్యూస్) : క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వ్యక్తికి తనను తాను రక్షించుకునే నైపుణ్యాన్ని కలిగిస్తాయని తైక్వాండో చాంపియన్‌షిప్ అసోసియేషన్ చైర్మన్ మహేశ్వర్ పేర్కొన్నారు. 9వ తెలంగాణ రాష్ట్ర తైక్వాండో ఛాంపియన్‌షిప్ (సబ్ జూనియర్, సీనియర్) పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి చైర్మన్ మహేశ్వర్‌తో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం కృష్ణ, జనరల్ సెక్రటరీ మీర్ వహాజ్ అలీ ఖాన్, కోషాధికారి మారుతి వరప్రసాద్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని సూచించారు. తైక్వాండో వంటి క్రీడలు ఆత్మరక్షణకు తోడ్పడటమే కాకుండా శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. పిల్లలను చిన్నప్పటి నుంచే క్రీడల వైపు ప్రోత్సహించి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని వారు పిలుపునిచ్చారు. పోటీల్లో గెలుపు–ఓటములు సహజమని, ఓటమి వల్ల నిరుత్సాహపడకుండా మరింత కృషి చేస్తే విజయాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ పోటీల్లో సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు నరసింహ, బి. కృష్ణ, వెంకటస్వామి, సీహెచ్ స్వామి, శ్రీనివాస్, రవికుమార్ తదితరులు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.





## నాచారం ఎర్రగుంట స్మశాన వాటిక శుభ్రత

### - వైకుంఠధామం అభివృద్ధికి అడుగులు

నాచారం, ఏప్రిల్ 26 (మనం న్యూస్) నాచారం ఎర్రగుంటలోని హిందూ స్మశాన వాటికలో పెరిగిపోయిన పిచ్చి మొక్కలు, కంపచెట్లు, ఎండిపోయిన చెట్ల కొమ్మలు, చెత్త మట్టి కుప్పలతో పరిసరాలు దుర్వస్థితికి చేరుకున్న నేపథ్యంలో శుభ్రత కార్యక్రమం చేపట్టారు. నాచారం డివిజన్ మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ సహకారంతో స్మశాన వాటికను పూర్తిగా శుభ్రపరిచినట్లు నూతనంగా ఏర్పాటైన స్మశాన వాటిక కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిను కలిసి, స్మశాన వాటికను వైకుంఠధామంగా అభివృద్ధి చేయడానికి మంజూరైన రూ. 3 కోట్ల నిధుల టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మిగిలిన చెత్త తొలగింపునకు మున్సిపల్ అధికారులతో రెండు రోజుల పాటు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, త్వరలోనే వైకుంఠధామం పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వెంటనే నాచారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నిత్యానందంకు ఫోన్ చేసి స్మశాన వాటికలో శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శ్రీమూర్తి నాగరాజ్, కొమ్మగల ప్రవీణ్, చిలుక శంకర్, జంగం నర్సింగ్, జంగం రాములు, బందెల మనోజ్, బి. బాలరాజ్, జంగా శ్రీధర్, ఎం. శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు అండగా స్కై ఫౌండేషన్ 299వ అన్నదానం

సికింద్రాబాద్, ఏప్రిల్ 26 (మనం న్యూస్) : నగరంలో నిరాశ్రయులు, అనాథలకు అండగా నిలుస్తూ స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 299వ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేసవి తీవ్రత కారణంగా ఇబ్బందులు పడుతున్న రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపై నివసిస్తున్న అనాథలు, నిరాశ్రయులు, సంచార జాతుల వారిని గుర్తించి వారికి ఆహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, సమాజంలోని పేద, నిరుపేదలకు ఆహార భద్రత కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కై ఫౌండేషన్ ఫౌండర్, ప్రెసిడెంట్ డాక్టర్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పావని.ఓ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వాసవి మాత జయంతి వేడుకలు



నాచారం, ఏప్రిల్ 26 (మనం న్యూస్) ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి సందర్భంగా నాచారంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం నాచారం కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సాయి బాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కుంకుమార్చన, వాసవి మాత పారాయణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సంఘం నాయకులు మాట్లాడుతూ, వాసవి మాత జయంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం హర్షణీయమని పేర్కొన్నారు. ఆర్యవైశ్యుల కులదేవతగా వాసవి మాతకు ప్రత్యేక స్థానం ఉందని, వ్యాపార రంగంతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కూడా ఆర్యవైశ్యులు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈ జయంతిని ఈసారి ప్రభుత్వ పరంగా నిర్వహించేందుకు కృషి చేసిన వారికి సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాచారం కమిటీ అధ్యక్షుడు శ్రీరామ్ సత్యనారాయణ (బండల), గౌరవ అధ్యక్షుడు సింగిరికొండ నరసింహ, ప్రధాన కార్యదర్శి బొగ్గారపు రమేష్, కోశాధికారి ఏగిన భాస్కర్, జాయింట్ సెక్రటరీ మహేశ్వర మూర్తి, అదనపు జాయింట్ సెక్రటరీ ఎలిషాల లింగం, ఉపాధ్యక్షులు గౌరీశెట్టి నరేందర్, పుల్లూరి లక్ష్మణ్, సలహాదారులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత విద్య ద్వారానే సమాజ సమస్యలకు పరిష్కారం

**హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక**

**ఘనంగా ఓయూ వ్యవస్థాపక వేడుకలు**



సికింద్రాబాద్, ఏప్రిల్ 26 (మనం న్యూస్) ఉస్మానియా విశ్వవిద్యాలయం 109వ వ్యవస్థాపక వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గత వైభవాన్ని స్మరించుకుంటూ, భవిష్యత్తు అభివృద్ధి దిశగా కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక మాట్లాడుతూ, ఉన్నత విద్య ద్వారానే సమాజ సమస్యలకు పరిష్కారం సాధ్యమని అన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాలపై మాత్రమే ఆధారపడకుండా, ఇతరులకు ఉపాధి కల్పించే దిశగా ఆలోచించాలని కోరారు. సామాజిక మాధ్యమాల దుష్ప్రభావాలకు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. గౌరవ అతిథి డాక్టర్ కె. కేశవరావు, తెలంగాణ అభివృద్ధిలో ఓయూ పాత్రను ప్రశంసిస్తూ, మారుతున్న కాలంలో విశ్వవిద్యాలయ అస్థిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ప్రధాన వక్త మోహన్ గురుస్వామి ప్రభుత్వ విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రస్తావిస్తూ, ప్రైవేటు ఆధిపత్యం పెరుగుదలపై ఆందోళన వ్యక్తం చేశారు. మెరిట్‌కు ప్రాధాన్యం కల్పించే విధానాలు అవసరమని సూచించారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఓయూ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. జూన్ 2 నాటికి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం, విశ్వవిద్యాలయాన్ని ప్రపంచ స్థాయి విద్యాకేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. మధ్యాహ్నం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో ఠాగూర్ ఆడిటోరియం దద్దరిల్లింది. విశ్వవిద్యాలయ ప్రాంగణం మొత్తం ఐక్యతకు ప్రతిబింబంగా నిలిచింది. ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్, డీన్లు, డైరెక్టర్లు, అధ్యాపకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధు లు, ఉద్యోగులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సహా దాదాపు 1200 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి, వైస్ ఛాన్సలర్ ఓఎస్డీ ప్రొఫెసర్ ఎస్. జితేంద్ర కుమార్ నాయక్, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ బి. సుధాకర్ రెడ్డి, కన్వీనర్ ప్రొఫెసర్ బి. లావణ్య పాల్గొన్నారు.





# జనగణన-2027లో స్వీయ గణనకు ముందుకు రావాలి

**మోతే శ్రీలత శోభన్ రెడ్డి**

సికింద్రాబాద్, ఏప్రిల్ 26 (మనం న్యూస్) : దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జనగణన--2027లో భాగంగా స్వీయ గణన ప్రక్రియకు ప్రజలు చురుకుగా స్పందించాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం తార్నాకాలోని ఆమె నివాసంలో టిటియూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డితో కలిసి ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా స్వీయ గణన ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జనగణన దేశ అభివృద్ధికి ప్రామాణిక ఆధారంగా నిలిచే కీలక ప్రక్రియ అని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం తప్పనిసరిగా ఇందులో భాగస్వామ్యం కావడం ద్వారా ప్రభుత్వానికి ఖచ్చితమైన గణాంకాలు అందుతాయని, తద్వారా సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అమలు అవుతాయని తెలిపారు. స్వీయ గణన విధానం ద్వారా ప్రజలు సులభంగా, పారదర్శకంగా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించబడిందని ఆమె వివరించారు. నగరంలోని ప్రతి గృహం జనగణనలో నమోదవ్వాలంటే ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జనగణన--2027 విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని, సమగ్ర అభివృద్ధికి ఇది పునాది వంటిదని ఆమె స్పష్టం చేశారు. నగర ప్రజలందరూ చురుకుగా పాల్గొని తమ వంతు సహకారం అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# డప్పు రత్నం జ్ఞాపకార్థం

**పార్వతి రాజరాజేశ్వర దేవాలయానికి రూ.51,000 విరాళం**

మనం న్యూస్ కొండాపూర్ ఏప్రిల్ 26 : కొండాపూర్ మండలంలోని మల్కాపూర్ గ్రామంలో ఓ మనసును తాకే సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన డప్పు రత్నం గారి జ్ఞాపకార్థంగా, ఆయన కుమారుడు డప్పు అనంతయ్య గారు తమ గ్రామంలోని శ్రీ పార్వతి రాజరాజేశ్వర దేవాలయానికి రూ.51,000 విరాళంగా అందజేశారు.

# ఓయూలో ఘనంగా భారతీయ సాంస్కృతిక సమ్మేళనం

**ఆర్ఎస్ఎస్ లేకుంటే భారతదేశం ముక్కలు అయ్యేది: విజయేంద్రప్రసాద్**





సికింద్రాబాద్, ఏప్రిల్ 26 (మనం న్యూస్) రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ లేకపోతే భారత దేశ పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోడానికే సాధ్యం కాదని రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ లేకుంటే భారతదేశం ముక్కలు, ముక్కలు అయ్యేదని అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్ లో భారతీయ సాంస్కృతిక సమ్మేళనం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, “హిందువు అనేది మతం కాదు, ఒక జీవన విధానం” అని పేర్కొన్నారు. ప్రపంచ శాంతిని ఆకాంక్షించే ధర్మంగా హిందూ ధర్మం నిలిచిందని, “వసుధైవ కుటుంబకం” అనే భావన ద్వారా ప్రపంచాన్ని ఒక కుటుంబంగా చూడాలని ఈ సంస్కృతి బోధిస్తుందని తెలిపారు. వందేమాతరం రచనకు 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దాని ప్రాముఖ్యతను గుర్తు చేశారు. వందేమాతరం కేవలం నినాదం మాత్రమే కాకుండా, బెంగాల్ విభజనను వ్యతిరేకిస్తూ దేశ ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చిన శక్తివంతమైన రణనినాదమని వివరించారు. ఇతర మతాలు గెట్ అండ్ ఫర్గెట్“తీసుకుని మరిచిపో” అనే భావనను చెప్పగా, హిందూ ధర్మం మాత్రం “గివ్ అండ్ ఫర్ గివ్” అనే ఉన్నతమైన విలువలను ప్రపంచానికి అందించిందని అన్నారు. 1925లో స్థాపితమైన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దేశభక్తులను తయారు చేయడంలో కీలక పాత్ర పోషించిందని, దేశానికి క్లిష్ట పరిస్థితుల్లో స్వయం సేవకులు సేవలందించిన విషయాన్ని ప్రస్తావించారు. స్వాతంత్ర్య సమరంలో జాతీయ భావజాలాన్ని పెంపొందించడంలో మరియు సమాజంలో ఐక్యతను బలపరచడంలో ఆర్ఎస్ఎస్ పాత్రను వారు వివరించారు. ఈ కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. సమ్మేళన నిర్వహణ కమిటీ అధ్యక్షులు ప్రొఫెసర్ కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ విజయ చరణ్, డాక్టర్ రామకృష్ణతో పాటు బోధన, బోధనేతర సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

